నమస్తే తెలంగాణ
వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 11 ఆగస్టు 2024 VIKARABAD

## పంట వైవిధ్యంతో భూసారం




సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : ఏక కాలంలో పలు రకాల పంటలను ఒకేచోట సాగు చేస్తే.. భూసారం పెరుగుతుందని, దీంతో అధిక దిగుబడి, గ్రీన్‌హౌస్ వాయువులు, ఉద్గారాలు తగ్గుతాయని ఇక్రిశాట్‌తో పాటు పలు అగ్రి రీసెర్చ్ ల్యాబ్‌లు చేసిన అధ్యయనంలో తేలింది. ఎనిమిదేండ్ల పాటు సుదీర్ఘకాలం చేసిన అధ్యయనంతో గ్రీన్‌హౌస్ వాయువుల తగ్గింపు, భూసారాన్ని పెంచడమే లక్ష్యంగా పరిశోధనలు చేయగా, ఒకేసారి రెండు, మూడు రకాల పంటలను సాగు చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉన్నట్లు తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సాగు చేసే వరి, గోధుమ పంటలను ఒకేసారి పండించి ఫలితాలను అంచనా వేశారు. సాధారణ సాగు విధానాల కంటే డైవర్సిఫైడ్ వ్యవసాయ పద్ధతుల్లో 23 శాతం అధిక దిగుబడి వచ్చినట్లు గుర్తించారు.



వికారాబాద్ మున్సిపల్ పరిధిలో మొక్కను నాటి నీరు పోస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

## 'పార్కులను అభివృద్ధి చేయండి'

వికారాబాద్, ఆగస్టు 10 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, అధికారులను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం వనమహోత్సవంలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 14, 23వ వార్డుల్లోని పార్కులలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులారమేశ్‌తో కలిసి కలెక్టర్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలే ఆధారమని, వర్షాలు కురిసేందుకు చెట్లు దోహద పడతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పార్కుల్లో యోగా బెడ్స్, పిల్లలు ఆడుకునేందుకు పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. పార్కులో ఉన్న 23వ వార్డు చిన్నారులతో ఎలాంటి ఆట వస్తువులు కావాలంటూ ముచ్చటించారు. మున్సిపల్ సిబ్బంది, డీఆర్డీఏ, ఆర్పీ లతో మాట్లాడి వారికి ఉన్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రామస్వామి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛ పల్లెలు..

బొంరాస్‌పేటలో పోచమ్మ దేవాలయానికి వెళ్లే రహదారి దుస్థితి



బంట్వారం ప్రభుత్వ దవాఖాన వెనుకాల కలుపు మొక్కలు

# మళ్లీ ఆగం

## పంచాయతీల్లో పాలన అస్తవ్యస్తం..

- పేరుకే ప్రత్యేకాధికారుల పాలన
- గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలు
- ఆరేడు నెలలుగా పంచాయతీ కార్మికులకు అందని జీతాలు
- డీజిల్ డబ్బులు కూడా లేక మూలన పడిన ట్రాక్టర్లు
- పైప్‌లైన్ లీకేజీలు, వీధి దీపాలు చిమ్మ చీకట్లు
- సమస్యలకు కేరాఫ్‌గా జీపీలు
- అధ్వానంగా మారిన పారిశుధ్యం
- తూతూ మంత్రంగా స్వచ్ఛదనం-పచ్చదనం

వికారాబాద్, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ పల్లెలుగా రూపుదిద్దుకున్న పంచాయతీల్లో పాలన పడకేసింది. 'పల్లె ప్రగతి'తో దేశంలో ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చెంది అవార్డులను సొంతం చేసుకున్న పల్లెలు ఆరేడు నెలలుగా అస్తవ్యస్థమయ్యాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క రూపాయి కూడా నిధులివ్వకపోవడంతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయి. గ్యారెంటీలతో ప్రజలను మోసం చేస్తూ కాంగ్రెస్ కాలం వెళ్లదీస్తున్నది. గ్రామాల్లో ఐదు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ప్రత్యేకాధికారులను నియమించారే తప్ప కేంద్రం నుంచి వచ్చే నిధులు నిలిచిపోవడం, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కుంటు పడింది. వేసవి కాలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి నిధులు ఇవ్వలేదు. పల్లెల్లో చిన్న చిన్న పనులు చేయించిన కాంట్రాక్టర్లకు రూ.4 కోట్ల వరకు ఇవ్వాల్సి ఉన్నా ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు దేశంలోనే ఆదర్శం కాగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పల్లెల పరిస్థితి అధ్వానంగా మారింది. ఆరేడు నెలలుగా పంచాయతీ కార్మికులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. చిన్న గ్రామ పంచాయతీల్లో కార్మికులకు 8 నెలలుగా జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డ్రైనేజీ పైప్‌లైన్ కూడా మరమ్మతులు చేయలేని పరిస్థితి నెలకొన్నదని పల్లె జనం ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అద్దంలా మెరిసిన పల్లెల్లోని రోడ్లు... ప్రస్తుతం మురుగు నీటితో దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులకూ డబ్బులు లేక దయనీయ పరిస్థితి నెలకొన్నది. దీనికి తోడు వర్షాలు పడుతుండడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామానికీ ఇచ్చిన ట్రాక్టర్లు ప్రస్తుతం మూలన పడ్డాయి. ట్రాక్టర్లకు ఈఎంఐలు కట్టలేని పరిస్థితితోపాటు కనీసం డీజిల్‌కు కూడా డబ్బులు లేక ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారింది. ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే ట్రాక్టర్లు మూలనపడడంతో పల్లెలు అపరిశుభ్రతతో అస్తవ్యస్తంగా మారాయి. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా చెత్త-చెదారంతో దర్శనమిస్తున్నది. కొన్ని పంచాయతీల్లో అయితే కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కొనలేని పరిస్థితి. మరోవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలాభివృద్ధికి చేసిన కృషితో 29 గ్రామ పంచాయతీలు జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులను సొంతం చేసుకొని దేశంలోనే ఆదర్శంగా గుర్తింపు పొందిన గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ ప్రభుత్వం కళావిహీనంగా మారుస్తున్నది.



కోట్‌పల్లి మండల కేంద్రంలోని కుమ్మరి గల్లీలో చెత్తాచెదారంతో పూడుకుపోయిన మురుగు కాల్వ

### జీపీల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం..

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం అటకెక్కింది. ఏ వీధి చూసినా అస్తవ్యస్థంగా మారింది. ఎక్కడ చూసినా మురుగు నీటి ప్రవాహం, చెత్త-చెదారమే కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నిత్యం రోడ్లు, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయగా రోడ్లు, వీధులు కళకళలాడేవి. ప్రస్తుతం పంచాయతీ కార్మికులకు ఏడెనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ చూపడం లేదు. పంచాయతీ ట్రాక్టర్లకు ఈఎంఐలు చెల్లించక, ఇటు కార్మికులు శ్రద్ధ చూపక ఇండ్ల మధ్యలోనే డంపింగ్ యార్డులు నెలకొంటున్నాయి.

### తూతూ మంత్రంగా స్వచ్ఛదనం-పచ్ఛదనం..

రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా పల్లెల్లో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం తూతూ మంత్రంగా ముగిసింది. కేవలం ర్యాలీలు, ప్రసంగాలు, ఫొటోల కోసం కొద్దిసేపు రోడ్లను ఊడ్చడం మినహా చేసిందేమీ లేదనే విమర్శలు వస్తున్నాయి. వారం రోజుల పాటు ఎలాంటి ఖర్చు చేయకుండా కార్యక్రమాన్ని ముగించేయడం గమనార్హం. స్థానికంగా ర్యాలీలు నిర్వహించేందుకు ఫ్లెక్సీలు మొదలుకొని ఇతర ఖర్చుల భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడడంతో ప్రభుత్వ తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వేసవిలో తాగునీటి కోసం పైపులైన్ల మరమ్మతులకు సొంత డబ్బులు పెట్టిన కార్యదర్శులు 'స్వచ్ఛదనం-పచ్చదనం' అంటూ మా నెత్తిన మరింత భారం మోపారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## శాంతి భద్రతల పరిరక్షణలో రాజీపడొద్దు

రాచకొండ సీపీ సుధీర్ బాబు..ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం ఆగస్టు 10 : శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడొద్దని రాచకొండ సీపీ సుధీర్ బాబు పోలీసులకు సూచించారు. శనివారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, పరిసరాలను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నేరాల అదుపునకు మరిన్ని సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం ఉన్న సీసీ టీవీ ఫుటేజీల నిర్వహణలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు, పెట్రోలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేసి చోరీలను నియంత్రించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో గస్తీని ముమ్మరం చేయడంతో పాటు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారుల విషయంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే వారికి మనోధైర్యాన్ని కల్పించాలని, పోలీసులంటే భయం వద్దని స్నేహభావాన్ని పెంపొందించాలన్నారు. మహిళల భద్రతకు పెద్దపీట వేయాలని, వారు పోలీస్ స్టేషన్‌కు వస్తే మర్యాదగా ప్రవర్తించాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సీపీ వెంట ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు సీఐ శ్రీ ఆంజనేయులు తదితరులు ఉన్నారు

- ఆర్నెల్లయినా అడుగుపడని ఎలివేటెడ్ కారిడార్లు'
- రక్షణ శాఖ అనుమతులు ఇచ్చినా.. ఎక్కడి గొంగళి అక్కడే
- ఇప్పటికీ పూర్తికాని ప్రాథమిక ప్రణాళిక
- టీఏల ఎంపిక టెండర్లకు స్పందన కరువు

# ఎలివేటెడ్ ఏమాయే..!

అంతన్నారు.. ఇంతన్నారు..

**ఇంత అన్నారు... అంత అన్నారు... అంతలోనే ముంత బోర్లేసినట్లుగా ఉంది ఎలివేటెడ్ కారిడార్ల కథ. ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు తామే జీవం పోశామంటూ.. రక్షణ శాఖ భూముల ప్రక్రియ కూడా తమతోనే సాధ్యమైందంటూ గొప్పలు పోయారే తప్ప.. తట్టెడు మట్టిని ఇప్పటికీ తరలించలేదు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం శంకుస్థాపనలతో చేసిన పనులు.. 'ఎలక్షన్ స్టంట్' అని తేలిపోయింది. దీంతో హైదరాబాద్‌కు తలమానికం కానున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ఆరు నెలలకు పైగా గడుస్తున్నా.. ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇప్పటికీ ఎప్పుడో మొదలుకావాల్సిన ప్రాజెక్టు...ప్రాథమిక దశను కూడా దాటలేకపోయింది. ఇక ట్రాన్సాక్షనల్ అడ్వైజర్ల పేరిట కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి నెలకొన్నది. అట్టహాసంగా భూమిపూజ చేసుకున్నా.. కాగితాలపైకి తీసుకురావడంలో సర్కారు విఫలమైంది.**

**- సిటీబ్యూరో, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ)**



ఎలివేటెడ్ కారిడార్ నమూనా

హైదరాబాద్ నగరానికి ప్రతిష్టాత్మకమైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల ప్రాజెక్టులు కాగితాల మీదకు కూడా తీసుకురాలేదు. ఓ వైపు రక్షణ శాఖ నుంచి తీసుకున్న భూములకు పరిహారం ఇతర ప్రాంతాల్లో భూముల బదలాయింపు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారితే... ఇక ప్రాజెక్టు నిర్మాణంపై పూర్తి స్థాయి అంచనాకు ప్రభుత్వం రాలేకపోయింది. హెచ్ఎండీఏ నిధులతో చేపడుతున్న ఈ ప్రాజెక్టుకు.. తెలంగాణలో ఇప్పటివరకు ఎక్కడా లేనట్లుగా ట్రాన్సాక్షనల్ అడ్వైజర్లతో(టీఏ) అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. టీఏలను నియమించుకునేందుకు నెల రోజుల కిందట కార్యాచరణ రూపొందించగా, కనీసం టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. ఏజెన్సీల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో గడువును ఆగస్టు 12 వరకు పొడిగించారు.

### డిజైన్లు ఖరారైనా..

దాదాపు 16 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల డిజైన్లు ఇప్పటికే ఖరారయ్యాయి. కానీ కార్యరూపంలోకి ప్రాజెక్టులను తీసుకురావడంలో టీఏలు ఇచ్చే సలహాలు ప్రామాణికం. ప్రాజెక్టు వ్యయంపై పూర్తి స్పష్టత లేకనే ప్రత్యామ్నాయంగా టీఏలను నియమించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట మీదుగా తూంకుంట వరకు ఉండే 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను సమగ్రంగా పరిశీలించేందుకు ఈ టీఏలను ఆశ్రయించగా, ఆ ప్రతిపాదనలు ఇంకా కొలిక్కి రాలేదు.

### పనులు మొదలయ్యేదెన్నడూ?

ప్రాజెక్టు ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ వంటి విషయాల్లో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ట్రాన్సాక్షనల్ అడ్వైజర్లను నియమించాలని హెచ్ఎండీఏను ఆదేశించింది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి డెయిర్ ఫాం రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ల కోసం సలహాదారులను నియమించుకునేందుకు హెచ్ఎండీఏ టెండర్లను పిలిచినా ఏ ఒక్క ఏజెన్సీ కూడా ముందుకు రాలేదు.

### కాగితాలెక్కని కారిడార్లు..

దాదాపు రూ. 3,800 కోట్ల అంచనా వ్యయంతో ఉత్తర తెలంగాణకు రవాణా సదుపాయాన్ని మెరుగుపరిచే ఈ ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ సర్కారు జాప్యం చేస్తున్నది. ఇప్పటికీ భూసేకరణ పనులు మొదలుపెట్టకపోగా, భూములు కోల్పోతున్న వారికి పరిహారం చెల్లించాలని ప్రాథమికంగా అనుకున్నప్పటికీ... రక్షణ శాఖ కోల్పోతున్న భూములకు మాత్రం ఇతర ప్రాంతాల్లో స్థలాలను కేటాయించాల్సి ఉంటుంది. కనీసం భూ బదలాయింపు ప్రక్రియలోనూ ఎలాంటి పురోగతి లేదు.

### భూ బదలాయింపులో జాప్యం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ఈ ప్రాజెక్టు నమూనాలు సిద్ధమైనప్పటికీ.. రక్షణ శాఖ భూముల బదలాయింపులో జాప్యం కారణంగా ప్రాజెక్టు ముందు సాగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ ప్రాజెక్టుకు భూములను కేటాయించేందుకు రక్షణ శాఖ ముందుకు రావడంతో.. ప్రాజెక్టు పట్టాలెక్కుతుందని భావించారు. కానీ ప్రభుత్వం ఆర్థిక వనరులు, వినియోగం, నిర్వహణ భారం వంటి రెవెన్యూ పరమైన అంశాలపై సమగ్రమైన నివేదికను రూపొందించలేకపోయింది. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీలను నియమించుకునేలా హెచ్ఎండీఏకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనికి ఆర్థిక వ్యవహారాల, మంత్రిత్వ శాఖతోపాటు ఎన్‌హెచ్ఏఐ గుర్తింపు పొందిన ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ కన్సల్టెన్సీలను హెచ్ఎండీఏ ఆశ్రయించింది. కానీ ఇప్పటి వరకు ఏ ఒక్క ఏజెన్సీ కూడా ముందుకు రాలేదు.




బొంరాస్‌పేటలో రంగులు వేసి బోర్డు మార్చిన అంగన్‌వాడీ కేంద్రం

# ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా..

## అంగన్‌వాడీ కేంద్రాలు

- భవనాలకు రంగులు, మారిన బోర్డులు
- చిన్నారులకు త్వరలో యూనిఫాంల పంపిణీ

బొంరాస్‌పేట, ఆగస్టు 10 : అంగన్‌వాడీ కేంద్రాలు కొత్తరూపు సంతరించుకుంటున్నాయి. కేంద్రాల వైపు చిన్నారులు ఆకర్షితులయ్యే విధంగా వాటిని తీర్చిదిద్దుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను మూడేండ్లు నిండే సరికి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించకుండా ఎల్‌కేజీ, యూకేజీ చదువుల కోసం ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తున్నారు. ప్రైవేటుకు అడ్డుకట్ట వేయడంతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా పేరు మార్చింది. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రం బోర్డులు నీలి రంగులో ఉండేవి. కొత్తగా రూపొందిన బోర్డులపై 'అంగన్‌వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల' అని తెలుగులో, 'అంగన్‌వాడీ ప్రీ ప్రైమరీ స్కూల్' అని ఆంగ్లంలో రాయించారు. బోర్డులోని రెండు చివరల రెండు లోగోలు ఉన్నాయి. మధ్యలో తెలంగాణ ప్రభుత్వం లోగో ఉన్నది. జిల్లాలోని 1107 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

### భవనాలకు రంగులు..

పక్కా భవనాలున్న, ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం కల్పించనున్నది. చిన్నారులకు తాగునీరు, మరుగుదొడ్లు, ఫ్యాన్లు వంటి వాటిని ఏర్పాటు చేయనున్నారు. వికారాబాద్ జిల్లాలో 1107 అంగన్‌వాడీ కేంద్రాలకుగాను 668 కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయి. 175 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లోని తరగతి గదుల్లో కొనసాగుతుండగా, 264 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సొంత భవనాలతో పాటు పాఠశాలల ప్రాంగణాల్లో కొనసాగుతున్న కేంద్రాలకు రంగులు వేస్తున్నారు.

### కొత్తగా రెండు పుస్తకాలు..

చిన్నారులకు బోధించడానికి అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం కొత్తగా రెండు పుస్తకాలను అందజేసింది. పూర్వ ప్రాథమిక విద్యా కరదీపిక, ప్రియదర్శిని అని రెండు పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రతి నెలా పిల్లలకు బోధించే అంశాలను ఈ పుస్తకాల్లో పొందుపర్చారు. చిన్నారులకు నేర్పించాల్సిన మంచి అలవాట్లు, పాటలు, విద్యార్థుల మధ్య సంభాషణ, పూర్వ గణిత భావనలు, ఆటలు వంటి వాటివి ఉన్నాయి. చిన్నారుల్లో సృజనాత్మకత పెంచేవిధంగా బొమ్మలు వేయడం, చేతి ముద్రలు వేయడం వంటి వాటిని నేర్పడంతో పాటు చిన్నారుల్లో ఆసక్తిని కలిగించే కథలు చెప్పాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనసాగిన ఆటపాటలతో కూడిన బోధనతో పాటు కొత్తగా ఇచ్చిన పుస్తకాలు చిన్నారులకు ఎంతో ఉపయోగపడనున్నాయి. వీటిని బోధించడంపై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కూడా ఇచ్చారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న యూనిఫాంలాగే అంగన్‌వాడీల్లో చదివే చిన్నారులకూ ప్రభుత్వం ఒక జత యూనిఫాం అందించనున్నది. వీటిని మహిళా సంఘాల ద్వారా కుట్టించే పని కొనసాగుతున్నది. జిల్లాలో ఐదు ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 1107 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వీటిలో ఏడు నెలల నుంచి 3 ఏండ్లలోపు చిన్నారులు 43,497 మంది, 3 నుంచి 6 సంవత్సరాలలోపు చిన్నారులు 19,693 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు.